రాష్ట్రస్థాయి పోటీలకు బాలికలు ఎంపిక

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలికలు

తిమ్మాజిపేట, నవంబర్ 17 : రాష్ట్రస్థాయి పోటీలకు తిమ్మాజిపేట బాలికలు ఎంపికయ్యారు. మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతిగృహానికి చెందిన పలువురు బాలికలు కబడ్డీ, ఖోఖోలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వార్డెన్ హేమలత తెలిపారు. పదోతరగతి విద్యార్థిని అంకిత రాష్ట్ర పోటీల్లో జిల్లాజట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఖోఖోలో వసతిగృహానికి చెందిన ఐదుగురు బాలికలు ఎంపికైనట్లు తెలిపారు. నందిని(9వ తరగతి), పీ. నందిని(8 తరగతి), ఎం నందిని, గాయత్రి రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. వీరితోపాటు వంద మీటర్ల పరుగులో నందిని జిల్లా మొదటిస్థానం, రోజా ద్వితీయస్థానం సాధించినట్లు తెలిపారు. చక్కని ప్రతిభ కనబర్చిన బాలికలను వార్డెన్ అభినందించారు.

బస్సులో అస్వస్థతకు గురైన మహిళకు వైద్యం

ప్రయాణికురాలిని 108లోకి ఎక్కిస్తున్న ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్

కల్వకుర్తి రూరల్, నవంబర్ 17 : కల్వకుర్తి డిపోకు చెందిన బస్సులో హైదరాబాద్ నుంచి వస్తుండగా ప్రయాణికురాలు నందిని ఆకస్మాత్తుగా తీవ్ర అస్వస్థతకు గురవ్వగా డ్రైవర్, కండక్టర్‌లు గమనించి ఆమెకు ప్రథమచికిత్స నిర్వహించిన అనంతరం కల్వకుర్తి దవాఖానకు తరలించినట్లు డీఎం సుభాషిణి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌నుంచి కల్వకుర్తి వైపు వస్తున్న బస్సులో తుక్కు గూడ వద్ద నందిని అనే ప్రయాణికురాలు ఎక్కిన కొంత సేపటికే లోబీపీ కారణంగా అకస్మాత్తుగా తీవ్రఅస్వస్థతకు గురైంది. దీంతో కండక్టర్ శశికళ డ్రైవర్ అంజయ్య 108అంబులెన్స్‌లో తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం కల్వకుర్తి దవాఖానకు తరలించి వైద్యం చేయించారు. ఈ సందర్భంగా డీఎం సుభాషిణి మాట్లాడుతూ.. ప్రయాణికులను ఒక చోట నుంచి మరో చోటుకి బస్సులో క్షేమంగా రవాణా చేయడంతో పాటుగా అస్వస్థతకు గురైన వారిని సకాలంలో స్పందించి వైద్యం చేయించడం చాలా అభినందనీయమన్నారు. నందినికి సకాలంలో వైద్య సేవలను అందేవిధంగా చేయడలంలో శ్రమించిన కండక్టర్ శశికళ, డ్రైవర్ అంజయ్యలను డీఎం అభినందించారు.

పాడి రైతులపై ప్రభుత్వం చిన్నచూపు

విలేకరులతో మాట్లాడుతున్న నారాయణరావు

వంగూరు, నవంబర్ 17 : పాల బిల్లులను సకాలంలో చెల్లించకుండా ప్రభుత్వం వారిపై చిన్నచూపు చూస్తుందని రైతుబంధు మాజీ మండల కన్వీనర్ నారాయణరావు అన్నారు. ఆదివారం మండలంలోని గాజర గ్రామంలో పాడిరైతులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిల్లులు రాక పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేదన్నారు. ఇక్కడి రైతులు పూర్తిగా పాడిపైనే ఆధారపడి జీవిస్తున్నారని, వారి గోస ప్రభుత్వానికి పట్టదా అని ఆయన ప్రశ్నించారు. గతంలో పాలబిల్లుల ద్వారానే ఇంటి సమస్యలు చిట్టీలు, ఇతర అవసరాలను రైతులు తీర్చుకునే వారని నేడు బిల్లులు రాకపోవడంతో రైతుల పరిస్థితి దీనావస్థలోకి చేరిందన్నారు. గత ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు వున్నప్పటికీ పాడి రైతులకు బిల్లులు సకాలంలో అందించేవారన్నారు. నేడు ఆ పరిస్థితి లేక పోవడంతో పశువులకు దాణా, రోగాల బారిన పడ్డ పశువులకు చికిత్స చేయించలేని స్థితిలో రైతులు వున్నారన్నారు. 15రోజులకొకసారి అందించాల్సిన పాల బిల్లు రెండు నెలలైనా ఇవ్వకపోతే రైతు పరిస్థితి ఎలాఉంటుందో అర్థం చేసుకోవాలన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం పాడి రైతుల పరిస్థితిని అర్థం చేసుకుని సకాలంలో పాలబిల్లులు అందించి వారికి అండగా ఉండాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నేత జనార్దన్‌రావు పాల్గొన్నారు.

కిడ్నీమార్పిడికి రూ.51వేలు సాయం

భరత్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న అంజియాదవ్

వెల్దండ, నవంబర్ 17 : మండలంలోని కుప్పగండ్లకు చెందిన గోరటి భరత్‌కుమార్ రెండు కిడ్నీలు ఫెయిల్ కావడంతో అనారోగ్యంతో బాధడుతున్నాడు. విషయం తెలుసుకున్న మండలంలోని బొల్లంపల్లికి చెందిన జియా గూడ మెళాయాదవ్‌సంఘం అధ్యక్షుడు చిన్నజంగయ్యయాదవ్ తన స్నేహితుల సహకారంతో రూ.51వేలను గ్రామానికి చెందిన అంజియాదవ్ ద్వారా భరత్‌కు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా జంగయ్యకు భరత్‌కు టుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మొదటిరోజు గ్రూప్-3 పరీక్ష ప్రశాంతం

- **జిల్లా వ్యాప్తంగా 53శాతం అభ్యర్థుల హాజరు**

నాగర్‌కర్నూల్, నవంబర్ 17 : జిల్లాలో ఆదివారం టీఎస్పీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్-3 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో 9,478 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా కేవలం 53% మాత్రమే హాజరయ్యారు. దీంతో జిల్లాలోని నాగర్‌కర్నూల్, బిజినపల్లి, తెలకపల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 33 పరీక్షా కేంద్రాల్లో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఆలస్యంగా వచ్చారంటూ చాలామందిని పరీక్ష కేంద్రాలకు రానివ్వక పోవడంతో అభ్యర్థులు వెనుదిరిగారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 9478 మంది అభ్యర్థులకు గానూ ఉదయం పేపర్-1కు 5086 మంది (53.7 శాతం) హాజరుకాగా.. మధ్యాహ్నం పేపర్-2కు 5087 మంది (53.7 శాతం) పరీక్ష రాశారు.

విశ్వవికాస్ కళాశాలలో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

విశ్వవికాస్ కళాశాలలో సమయం అయిపోడంతో గేటుబయట ఉన్న అభ్యర్థి

పరీక్షా కేంద్రాలవద్ద పోలీసులు భద్రత

విశ్వవికాస్ కళాశాలలో సమయం అయిపోవడంతో పరుగెత్తుతున్న అభ్యర్థులు

జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో తనిఖీ చేస్తున్న సిబ్బంది

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర హాల్‌టికెట్ నంబర్లను చూస్తున్న అభ్యర్థి

బస్సుసౌకర్యం కల్పించాలి

బల్మూరు, నవంబర్ 17 : అచ్చంపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుసౌకర్యం కల్పించాలని ప్రయాణికులు ఆదివారం కోరారు. ప్రతిఆదివారం పెద్దకొత్తపల్లి మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ దగర జరిగే జాతరకు అచ్చంపేట డిపో నుంచి బస్సుసౌకర్యం లేక పోవడంతో మండలంలోని భక్తులు లింగాలకు వెళ్లి ప్రైవేట్ వాహనాల్లో ఆమ్మవారి దర్శనానికి పోవడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఉదయం లింగాల మండల కేంద్రం నుంచి అనంతవరం, బల్మూరు, కొండనాగుల, అచ్చంపేట నుంచి హైదరాబాద్‌కు బైపాస్‌బస్సు సౌకర్యం కల్పించాలని ప్రయాణికులు డిపో అధికారులను కోరుతున్నారు. అదేవిధంగా అచ్చంపేట నుంచి సాయంత్రం 6 గంటలకు బల్మూరు, లింగాల మండలాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు, ప్రజలు, వివిధ శాఖల అధికారులు నానా ఇబ్బందులు పడ తున్నారు. రాత్రి సమయంలో అచ్చంపేట పట్టణం నుంచి రోజు మండలం మీదుగా లింగాలకు బస్సుసౌకర్యం కల్పించేవిధంగా అధికారులు, ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ప్రజల, ప్రయాణికులు ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని వెంటనే ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

ఆత్మరక్షణకు ఆయుధం తైక్వాండో

తైక్వాండలో శిక్షణ ఇస్తున్న గ్రాండ్‌మాస్టర్ శోభన్‌బాబు

దోమలపెంట, నవంబర్ 17 : మండలంలోని దోమలపెంటలో ఆదివారం రోజున ఈగలపెంట డీఏవీ స్కూల్‌లో తైక్వాండో శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తైక్వాండో గ్రాండ్‌మాస్టర్ శోభన్ బాబు మాట్లాడుతూ.. సుమారు 50 మందికి పైగా బాల బాలికలు శిక్షణ పొందుతున్నారన్నారు. అమ్మాయిలకు ఆత్మరక్షణగా తైక్వాండో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. చదువుతోపాటు శారీరక ధారుఢ్యం ముఖ్యమన్నారు. నేటి సామాజిక పరిస్థితుల్లో మహిళలు, విద్యార్థినులు, యువతులు ప్రతిఒక్కరికీ స్వీయరక్షణ ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెలగని హైమాస్ట్ లైట్లు

చౌరస్తా వద్ద నామమాత్రంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు

వంగూరు, నవంబర్ 17 : మండలంలోని హైదరాబాద్ -శ్రీశైలం ప్రధాన రహదారిపై జూపల్లి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు రాత్రి వేళలో వెలగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కల్వకుర్తి నుంచి దేవరకొండ, హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే రహదారి ఒకటే ఉండి మండలంలోని శ్రీశైలం చౌరస్తా వద్ద కుడివైపు శ్రీశైలం, చక్కగా వెళ్తే దేవరకొండ వెళ్తాయి. ఇక్కడే రోడ్డు అభివృద్ధిలో భాగంగా అండర్‌గ్రౌండ్ సైతం ఏర్పాటు చేశారు. ఈ చౌరస్తావద్ద రోడ్డు సేఫ్టీ అధికారులు హైమాస్ట్ లైట్లను కొన్ని నెలల క్రింద ఏర్పాటు చేశారు. కానీ లైట్లు ఇంతవరకు వెలగకపోడంతో వాహనదారులు, ప్రయాణికులు రాత్రి వేళలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగా శ్రీశైలంవెళ్లే వాహనదారులు శ్రీశైలం వెళ్లకుండా దేవరకొండ వైపు వెళ్లి అనుమానం వచ్చి తిరిగి వస్తూ నానా యాతన పడుతున్నారు. ప్రధానచౌరస్తా కావడంతో రాత్రి వేళలో ద్విచక్రవాహనంపై వచ్చే ఫ్యామిలీ సభ్యులు చౌరస్తాలో చీక టిగా వుండటంతో తీవ్ర భయాందోళనకు గురవుతూ ప్రయాణిస్తుంటారు.

రెండురోజుల కిందట ద్విచక్రవాహనంపై వచ్చే భార్య భర్తలపై కొందరు అటాక్ చేసే ప్రయత్నం చేయబోయారు. ఎదురుగా ఓ కారు వస్తుండటంతో భార్య భర్తలు కారును ఆపడంతో వారు పారిపోయారు. ఇటువంటి ప్రమాదాల నుంచి ప్రయాణికులను రక్షించాలంటే హైమాస్ట్ లైట్లు వెలిగే విధంగా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళమృతి

మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా చేస్తున్న బంధువులు

పెద్దకొత్తపలి, నవంబరు 17 : మండలంలోని కల్వ కోటులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనకు సంబంధించి ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లాపుర్ మండలం కుడికిళ్లకు చెందిన నిరంజనమ్మ 50 తన తల్లిగారి ఊరు ముష్టిపల్లికి వెళ్లి తిరిగి వచ్చి బస్సుకోసం బస్టాండ్‌లో వేచిచూస్తున్నప్పుడు హైదరాబాద్ నుంచి వస్తున్న కారు బస్సును ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించి మహిళను ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. వేగంగా నడిపి మహిళ మృతికి కారణమైన అయిన వారిని వెంటనే అరెస్టు చేసి మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు ధర్నా చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

మారేపల్లిలో పత్తి దగ్ధం

తిమ్మాజిపేట, నవంబర్ 17 : మండలంలోని మారేపల్లిలో పత్తి దగ్ధమైంది. స్థానికుల వివరాల మేరకు రైతువేదికలోని ఒక గదిలో గ్రామానికి చెందిన రైతు మల్లయ్య దాదాపు 30క్వింటాళ్ల పత్తి నిల్వఉంచగా, ఆదివారం మధ్యాహ్నం పత్తికి నిప్పంటుకుని కాలిపోయినట్లు తెలిపారు. అయితే ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుందా, లేక ఎవరైనా నిప్పుపెట్టారన్నది తెలియనప్పటికీ రైతు మల్లయ్యకు చెందిన రూ.2లక్షలకు పైగా విలువైన పత్తి మొత్తం అగ్నికి ఆహుతి అయ్యింది. ఈ ప్రమాదంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

చారకొండ, నవంబర్ 17 : ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలుచేయాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అనేక హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు మద్దినారాయణరెడ్డి, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనులను వేగవంతంగా చేయాలి

అచ్చంపేట రూరల్, నవంబర్ 17 : ఉమామహేశ్వర ఆలయ కొండ కింద భోగమ వేశ్వర పంచలింగాల ఆవరణలో రూ.1.20 కోట్లతో జరుగుతున్న ఆలయ పునర్ నిర్మాణపనులు, నూతన ఆంజనేయ స్వామి ఆలయపనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆలయ చైర్మన్ బీరం మాధవరెడ్డి గుత్తేదారును ఆదేశించారు. ఆదివారం ఆయన తాజామాజీ రంగాపూర్ సర్పంచ్ లోక్యానాయక్‌తో కలిసి పంచలింగాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి తగు సలహాలు సూచనలు చేశారు. సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించబోయే ఉమామహేశ్వరాలయ బ్రహ్మోత్సవాలలోపు ఆలయ నిర్మాణాల పనులను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాసరావు, అర్చకులు వీరయ్యశాస్త్రి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ బీరం మాధవరెడ్డి

బాలోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

బాలోత్సవాలను విజయవంతం చేయాలి

కల్వకుర్తి రూరల్, నవంబర్ 17 : కల్వకుర్తి పట్టణంలోని 19న మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించున్న బాలోత్సవాల జాతరను విజయవంతం చేయాలని బాలోత్సవాల కమిటీ కన్వీనర్ చెన్నయ్య కోరారు. ఆదివారం పట్టణంలోని టీయూటీఎఫ్ భవనంలో బాలోత్సవాల పోస్టర్‌ను పలువురితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం నిర్వహించబోయే బాలోత్సవాలకు ఎమ్మెల్యే నారాయణరెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్, బాలోత్సవాల రాష్ట్ర కమిటీ కార్యదర్శి సోమయ్య, రాష్ట్ర నాయకులు వీరాంజనేయులుతో పాటు పలువురు హాజరవుతున్నట్లు కార్యక్రమాలను విజయవంతం చేయాలని కమిటీ నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో ఏపీ మల్లయ్య, లక్ష్మణమూర్తి, ఖాదర్‌పాష, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న సమగ్ర సర్వే

చారకొండలో సర్వే చేస్తున్న ఉపాధ్యాయురాలు

చారకొండ, నవంబర్ 17 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే మండలంలో అన్నిగ్రామాల్లో చురుకుగా కొనసాగుతుంది. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్ మాట్లాడుతూ.. సర్వేపై ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావొద్దని, ప్రతిఒక్కరూ సర్వేలో భాగస్వాములు కావాలన్నారు. ఎన్యుమరేటర్లకు పూర్తి వివరాలు అందజేసి సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయుడిని నియమించాలి

కొండారెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాల

బల్మూరు, నవంబర్ 17 : మండలంలోని కొండారెడ్డిపల్లిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఆదనంగా ఉపాధ్యాయుడిని నియమించాలని గ్రామస్తులు పంబ రాధకృష్ణ, నిరంజన్, ధర్మారెడ్డి, వెంకటయ్య, చంద్రయ్య, బాలగౌడ్, విష్ణు, వెంకట్ స్వామి ఆదివారం కోరారు. పాఠశాలలో కేవలం ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే ఉండడంతో విద్యార్థులకు పూర్తిస్థాయిలో విద్యను అభ్యసించడం లేదన్నారు. ఉన్న ఉపాధ్యాయుడు సెలవులో ఉండడంతో పాఠశాలబంద్ కావడం జరుగుతుందన్నారు. జిల్లా విద్యా శాఖఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని వెంటనే ఆదనంగా ఉపాధ్యాయుడిని వెంటనే నియమించాలన్నారు. లేకుంటే పాఠశాల మూతపడే అవకాశం ఉందన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తారనే నమ్మకం ప్రజలకు కల్పించాలని వారు కోరారు. ఎంఈవో, మండలస్థాయి అధికారులు గ్రామంలోని పాఠశాలకు వెంటనే వలంటీర్‌ను అయినా నియమించాలని కోరారు.

శివాలయంలో కార్తీకమాస పూజలు

బిజినేపల్లి, నవంబర్ 17 : మండలంలోని పాలేం, వడ్డేమాన్, బిజినేపల్లి, గంగారం, మహాదేవునిపేట గ్రామాల్లో కల శివాలయాల్లో ఆదివారం కార్తీకమాస పూజలను నిర్వహించారు. ఉదయంవేళలో స్వామివారికి రుద్రాభిషేకాలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం సమయాల్లో మహిళలు పెద్దసంఖ్యలో ఆలయ ప్రాంగణాల్లో దీపారాధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చక్రపాణి, జయంత్‌కుమార్ ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జనార్దన్‌రెడ్డి

ఊర్కొండ, నవంబర్ 17 : మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలో ఆదివారం పీఏసీసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా సీవో వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని మద్దతుధరను రైతుల ఖాతాలో వేస్తుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీఎం సహదేవ్ మాట్లాడుతూ.. ఏ గ్రేడ్ రకం వడ్లకురూ.2,320 బీగ్రేడ్ వడ్లకు రూ.2300, సన్నధాన్యం 500 బోనస్ క్వింటాకు ఇస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విజయవంతమైన టీపీటీఎఫ్ కౌన్సిల్ సమావేశం

ప్రతిజ్ఞ చేస్తున్న సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్, నవంబర్ 17 : జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం విజయవంతమైంది. జిల్లాఅధ్యక్షుడు లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో సమావేశంలో పలు విషయాలను చర్చించారు. సంఘం ఆధ్వర్యంలో విద్యారంగ సమస్య పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మికాంత్, ప్రధాన కార్యదర్శిగా వెంకట్, ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, కొమురయ్య, కార్యదర్శిగా మల్లికార్జున్, కార్యవర్గస భ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నారాయణనమ్మ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338958-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748